ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 28 జనవరి 2025 | 5





నేడు అక్షరం అండగా

అమలాపురం 3వ వార్డులో చర్చావేదిక

మా అక్షరం..మీ ఆయుధం.. ఇదే ఆంధ్రజ్యోతి నినాదం.. ఆ అక్షరంతోనే జనం చెంతకు వస్తోంది.. ఇప్పటి వరకూ అక్షరంతో జనగళమై ఆంధ్రజ్యోతి ప్రశ్నించింది. ఇప్పుడు స్థానిక సమస్యలకు సంబంధించి జనవాణి వినిపించేందుకు మంగళవారం నుంచి తొలి అడుగు వేస్తోంది.. రండి..చేయి కలపండి.. సమస్యలను తెలియజేయండి..

అమలాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా అనే నినాదంతో మంగళవారం జిల్లా కేంద్రమైన అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని 3వ వార్డులో ఆ ప్రాంత కీలక సమస్యలపై చర్చావేదిక జరగనుంది. పట్టణంలోని 3వ వార్డు పరిధిలో గల వేపచెట్టు కనకదుర్గమ్మ ఆలయం ప్రాంగణం వద్ద మంగళవారం జరిగే ఈ చర్చావేదికలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, వార్డు కౌన్సిలర్, జనసేనకు చెందిన మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీనులతో పాటు వార్డులో ముఖ్య నాయకులు పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు చర్చావేదిక ప్రారంభం కానుంది. ఈ వార్డు పరిధిలో ఇప్పటికే కొన్ని కీలక సమస్యలపై ప్రజలు పరిష్కారం కోసం గళం విప్పుతున్నారు. ప్రధానంగా రహదారుల అభివృద్ధి, డ్రైన్ల మరమ్మతులు, తాగునీటి సమస్యలతో పాటు మురుగునీటి డ్రైన్‌లో ఉన్న కుళాయిలను సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో పాటు కుక్కల బెడద, విద్యుత్‌దీపాల సమస్యలను పరిష్కరించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

గ్రీవెన్స్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

● కలెక్టర్ మహేష్‌కుమార్ ● 210 అర్జీల స్వీకరణ



దివ్యాంగుల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

అమలాపురం టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై అందించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ అర్జీలతో పాటు స్వర్ణాంధ్ర విజన్, రెవెన్యూ సమస్యలు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లాను ముందు వరుసలో నిలిపేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం జిల్లాస్థాయిలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో రాజకుమారి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్.త్రినాథరావు, కృష్ణమూర్తి వివిధ సమస్యలపై 210 అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ విపత్తుల నిర్వహణకు సంబంధించి వివిధ శాఖలు సమన్వయంతో జియో కోఆర్డినేటర్స్‌తో మ్యాప్‌లను రూపొందించాలని ఆదేశించారు. రోడ్లు, కాల్వలు, డ్రైనేజీలు, విద్యా సంస్థలు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, సైక్లోన్ పునరావాస కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు తదితర అంశాలపై మ్యాప్‌లను చిత్రీకరించాలని ఆదేశించారు. ఈ నెల 28న మధ్యాహ్నం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద స్వామివారి తిరు కల్యాణోత్సవాలకు సంబంధించి జిల్లాస్థాయి అధికారులతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని జేసీ తెలిపారు. జిల్లాస్థాయి అధికారులతో పాటు వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది దేవస్థానానికి విరాళాలు

అంతర్వేది, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం అనంతరం కృష్ణాజిల్లా కపిలేశ్వరానికి చెందిన చిదిళ్ల సాయికృష్ణ రూ.లక్ష విరాళం అందజేశారు. విరాళ దాతకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించి అభినందించారు. అలాగే బంటుమిల్లి మండలం చోరంపూడికి చెందిన బ్రహ్మశ్రీ సద్గురు వీర్లవెంకయ్య వారి ఆశ్రమం నుంచి రూ.50 వేలు విరాళంగా సమర్పించారు.

అమలాపురంలో దొంగల బీభత్సం

7లో

రెండు చోట్ల చోరీలు..నగదు అపహరణ

ముస్తాబవుతున్న అంతర్వేది..



విద్యుత్ దీపాల సెట్టింగులకు ఏర్పాట్లు



సిద్ధమవుతున్న అశ్వ వాహనం

అంతర్వేది దేవస్థానంలో చకచకా కల్యాణోత్సవ ఏర్పాట్లు

వాహన సేవకు సిద్ధమవుతున్న వాహనాలు

ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ల ఏర్పాట్లు

అంతర్వేది, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సాగర సంగమ తీరాన పశ్చిమ ముఖ దిశగా అంతర్వేది పుణ్యక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు మాఘమాసం ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు వైభవంగా జరిపించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. మొదటి రోజు నుంచి వాహన సేవలు అందుకోనున్న స్వామివారి సూర్య, చంద్ర, గరుడ, పుష్పక, హంస, పంచముఖాంజనేయ, పంచగరుడ, గజ, పొన్న, హనుమ, సింహ, రాజాధిరాజ, అశ్వ వాహనాలు, రథం పైన ఉండే గుర్రాలకు మెరుగులు దిద్దుతూ ముస్తాబు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభ పీఠం, బేడ మండపంలో రంగురంగుల ముగ్గులు, ఆలయ పరిసరాల్లో విద్యుత్ అలంకరణ సెట్టింగు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. క్యూలైన్లకు రంగులు, బారికేడ్లు, కల్యాణ మండపానికి చలువ పందిళ్లు, ఆలయ ప్రాంగణ ఉత్తర భాగంలో తాత్కాలిక కోనేరు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరోపక్క పుణ్య క్షేత్రానికి వచ్చే రహదారుల పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రతీరోజు వివిధ శాఖల అధికారులతో స్వామివారి కల్యాణోత్సవాలపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ ఉత్సవాల విజయం పరంపర అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

టీడీపీ, జనసేన వార్డులపై నిర్లక్ష్యం..



కౌన్సిల్ మీటింగ్‌కు హాజరైన ఎమ్మెల్యే ఆనందరావు

ప్రతిపక్ష కౌన్సిలర్ల ఆగ్రహం

కాంట్రాక్టర్లకు రూ.4కోట్లు బకాయిలు ఉండగా రూ.7కోట్లకు టెండర్లా

ఎమ్మెల్యే ఆనందరావు మండిపాటు

వాడివేడిగా అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్

అమలాపురం టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో టీడీపీ, జనసేన వార్డుల్లో వర్కులు కేటాయించడంలో వివక్ష చూపుతున్నారని ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, టీడీపీ కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లకు కోట్లు కాంట్రాక్టర్లకు బకాయిలు ఉండగా కొత్తగా టెండర్లు ఎలా పిలిచారని, అసలు మున్సిపల్ బడ్జెట్ ఎంత అని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన సోమవారం వాడివేడిగా జరిగింది. సిబ్బందికి జీతాలు, కార్యాలయ నిర్వహణకు ఏడాదికి రూ.7 కోట్ల బడ్జెట్ అవుతుందని కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు రూ.4 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని, కొత్తగా రూ.7 కోట్లకు టెండర్లు పిలిచినట్టు కమిషనర్ వివరణ ఇచ్చారు. మరి ఆ డబ్బు ఎక్కడనుంచి చెల్లిస్తారని ఎమ్మెల్యే ఆనందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు లేఖ రాస్తానని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పురపాలక సంఘంలో నిబంధనలు అతిక్రమణకు సంబంధించి ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రశ్నించగా రెవెన్యూ అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ 97 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరణ ఇచ్చారు. ప్రస్తుతం కేఎఫ్‌సీకి కేటాయించిన భవనానికి సంబంధించి గతంలో అద్దెకు తీసుకున్న వ్యక్తి నుంచి బకాయిలు వసూలు చేశారా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. తక్షణం ఆ బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. వచ్చే వేసవి సీజన్‌లో పట్టణంలోని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా 4 వంతెనలు నిర్మించనున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం ఈదరపల్లి వంతెన మీదుగా భారీ వాహనాల రాకపోకలు ఆపాల్సిన పరిస్థితి ఉందని, ప్రస్తుతం ఆ వంతెన పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆనందరావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ పురపాలక సంఘంలో ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారని రూ.7 కోట్ల పనులకు టెండర్లు పిలిచి రూ.2 కోట్ల మేరే పనులు చేసి మిగిలిన సొమ్ములు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఫుడ్ సేఫ్టీ అధికారి, క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. కమిషనర్ తీరుపై కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. మా వార్డులో పనులు కేటాయించడం లేదని, పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కౌన్సిల్ ఏర్పడి నాలుగేళ్లు అయినా స్వలాభం కోసమే పనులు కేటాయిస్తున్నారని, ఇది దారుణమని మండిపడ్డారు. మా వార్డుల్లో చిన్నచిన్న పనులు కూడా చేసుకోలేని పరిస్థితుల్లో జనసేన టీడీపీ కౌన్సిలర్లు ఉంటే వైసీపీ వార్డుల్లో చకచకా పనులు జరిగిపోతున్నాయని యేడిద శ్రీను ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

గీత కులాలకు 13 మద్యం షాపులు

లిక్కర్ దుకాణాలు కేటాయిస్తూ ఉత్తర్వులు

ఒక షాపు గౌడ కులస్తులకు,

మిగిలినవి శెట్టిబలిజలకు..

ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తుల స్వీకరణ

7న కలెక్టరేట్‌లో లాటరీ ద్వారా ఎంపిక

అమలాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో గీత కులాలకు ప్రత్యేకంగా 13 మద్యం షాపులను కేటాయించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్ తెలిపారు. 13 మద్యం షాపులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. వీటిలో ఒక షాపును గౌడ కులస్తులకు, మిగిలిన 12 షాపులను శెట్టిబలిజ సామాజికవర్గానికి కేటాయించామన్నారు. గౌడ కులస్తులకు ప్రత్యేకంగా రామచంద్రపురం రూరల్ షాపును కేటాయించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఇక శెట్టిబలిజ సామాజికవర్గానికి అమలాపురం పురపాలక సంఘం, అమలాపురం మండలం అయినవిల్లి, ఐ.పోలవరం, ముమ్మిడివరం రూరల్, రామచంద్రపురం పురపాలక సంఘం కె.గంగవరం, మండపేట పురపాలక సంఘం, ఆలమూరు, కపిలేశ్వరపురం, కొత్తపేట, పి.గన్నవరం మద్యం షాపులను కేటాయించామన్నారు. దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు డీడీ రూపంలో అందించడంతో పాటు కుల ధ్రువీకరణ, నేటివిటీ సర్టిఫికెట్ అందించాలన్నారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఫిబ్రవరి 7న ఉదయం 10 గంటలకు గోదావరి భవన్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ విధానంలో ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తులను అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం, ముమ్మిడివరం, కొత్తపేట, ఆలమూరు, రామచంద్రపురం కార్యాలయాల్లో అందజేయవచ్చునన్నారు.

దావోస్ పర్యటనతో భారీ పెట్టుబడులు తథ్యం

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



ద్రాక్షారామ,జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ బృందం నాలుగు రోజుల దావోస్ పర్యటన విజయవంతమైందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం మెండుగా ఉందని తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంగా చేపట్టిన ఈ పర్యటనలో దిగ్గజ పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రాకు తరలివస్తున్నారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ వాణిజ్య రంగాల్లో 15 దిగ్గజ సంస్థలైన స్విస్, మెన్, ఓర్లీకన్, ఆంగ్స్ ఫిస్టర్, స్విస్ టెక్స్‌టైల్స్ సీఈవోలతోను, రవాణా రంగంలో గుర్తింపు పొందిన మెర్సన్ సంస్థ, డేటా సెంటర్లు, బిల్‌గేట్స్ వంటి వారితో జరిపిన చర్చలు ఫలవంతం కానున్నాయని చెప్పారు. ఏడు నెలల కూటమి ప్రభుత్వంలో 6,33,568 కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, తద్వారా ఐదు లక్షల పది వేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. రాష్ట్రాభివృద్ధికి అలుపెరగని కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వారం రోజుల్లో.. ఆక్వా చెరువుల సర్వే పూర్తి చేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతంలోని ఆక్వాజోన్ ఆక్వాయేతర జోన్లలో ఎంత విస్తీర్ణంలో ఆక్వా చెరువులు ఉన్నవి వారం రోజుల్లో సర్వే చేసి గుర్తించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జియో కోఆర్డినేట్స్ మ్యాప్‌లతో సహా బృందాలు సర్వే ఆధారంగా ఖచ్చితత్వంతో చెరువులను గుర్తించాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం మత్స్యశాఖ అధికారులు, ఆర్డీవోలతో సమావేశం నిర్వహించి కోస్టల్ రీజియన్ జోన్, కోస్తా తీర ప్రాంత మేనేజ్‌మెంట్ హరిత ట్రిబ్యునల్, భూగర్భ జల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలు, కోస్టల్ ఆక్వా అథారిటీ ప్రకారం ఆక్వా చెరువుల అనుమతులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే రెండు పర్యాయాలు సర్వే నిర్వహించినప్పటికీ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మరోసారి సర్వే నిర్వహించడానికి ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. జీవో నంబరు 16 ప్రకారం వారం రోజుల్లో సర్వే పూర్తి చేస్తూ రోజువారీ సర్వే వివరాలను రాష్ట్రస్థాయి కమిటీకి సమర్పించాలన్నారు. అంతర్వేది ఉత్సవాలకు నియమించిన సిబ్బందికి ఆటంకం వాటిల్లకుండా మిగతా సిబ్బందిని సర్వే బృందాలుగా నియమించి ఆక్వా చెరువుల లెక్క తేల్చాలన్నారు. హరిత ట్రిబ్యునల్ అతిక్రమించినట్టు ప్రకటించిన చెరువుల్లో ఆక్వా సాగును పూర్తిగా రద్దు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, దేవరకొండ అఖిల, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, ఏడీ ఎల్‌బీఎస్ వర్ధన్, ఎఫ్‌డీవో గోపాలకృష్ణ, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలి

ఫిబ్రవరి 10 నుంచి జనరల్ ప్రాక్టికల్స్


ఇంటర్మీడియట్ బోర్డు ఎగ్జామినేషన్ జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో జేసీ నిషాంతి



సమావేశంలో కమిటీకి దిశానిర్దేశం చేస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి కమిటీ సభ్యులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఇంటర్మీడియట్ బోర్డు ఎగ్జామినేషన్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన నిర్వహించారు. మార్చిలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలను లైన్ విభాగాల అధిపతులు సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎటువంటి పేపరు లీకేజీలకు, మాల్ ప్రాక్టీసులకు తావు లేకుండా నిర్వహించాలన్నారు. జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 10 నుంచి 20వ తేదీ వరకు, ఒకేషనల్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 5 నుంచి 20వ తేదీ వరకు రెండు సెషన్లలో నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రాక్టికల్ థియరీ పరీక్షలు నిర్వహిస్తారు. జనరల్ ప్రాక్టికల్ పరీక్షల కోసం జిల్లాలో 60 కేంద్రాలు, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల కోసం 41 కేంద్రాలు కేటాయించామన్నారు. పార్యాంశ పరీక్షల కోసం జిల్లాలో 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒక ఎయిడెడ్ జూనియర్ కళాశాల, రెండు సోషల్ వెల్ఫేర్ కళాశాలలు, 25 ప్రైవేటు అన్ ఎయిడెడ్ కళాశాలలో కలిపి 40 కేంద్రాలను కేటాయించామన్నారు. రాత పరీక్షలకు 22,258 మంది ఉండగా ఒకేషనల్‌కు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 5,055 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఏ విధంగా చేయాలో ఆదేశించారు. రాత పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఆర్టీసీ పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులు నడపాలని జేసీ ఆదేశించారు. రాత పరీక్ష, పేపరు మీడియం, సబ్జెక్టుల వారీగా లాటరీ విధానంలో ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో డీఆర్వో రాజకుమారి, బోర్డు కన్వీనర్ వి.సోమశేఖరరావు, కమిటీ సభ్యులైన డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, ఆర్టీసీ ప్రతినిధి శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఈఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.





నేడు బ్రహ్మసమేధ్యం తీర్థం

కాట్రేనికోన, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం పల్లం గ్రామ శివారు సముద్ర తీరాన బ్రహ్మసమేధ్యం ఉంది. ప్రతి ఏటా చొల్లంగి అమావాస్య రోజున ఇక్కడ తీర్థం జరుగుతుంది. చొల్లంగి రోజున సముద్ర స్నానాల కోసం జిల్లా వ్యాప్తంగా పలువురు ఇక్కడకు రావడం ఆనవాయితీ. ఈ నెల 28న తీర్థానికి ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆ రోజు వేకువజామున సముద్ర గర్భం నుంచి వచ్చే సూర్యోదయాన్ని తిలకించేందుకు భక్తులు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. బ్రహ్మసమేధ్యంలో కాలభైరవస్వామి కొలువై ఉన్నాడు. ఈ ప్రదేశంలో ఆయన పాదముద్రలు పురాణాలకు సాక్ష్యంగా ఉన్నాయి. వీటిలో శంఖుచక్రాలు, వింజామరలు నేటికీ కనిపించడం ఈ క్షేత్ర ప్రసిద్ధికి తార్కాణం. సంతానం లేని స్త్రీలు స్వామిని ఆరాధించి నిద్రిస్తే కలిగే స్వప్నంలో కొబ్బరికాయలు, గుమ్మడికాయలు కన్పిస్తే సంతానం కల్గుతుందని నమ్మకం. ఈ ప్రాంతంలో గట్టి పోలీసు నిఘా ఏర్పాటుచేశారు.

కిర్లంపూడి సొసైటీలో భారీ అవినీతి

వార్త..7లో

సైకిల్ సవారీ ఆరోగ్యానికి దారి..





కాకినాడలో సైకిల్ ట్రాక్‌పై సైక్లింగ్..

కాకినాడలో ప్రత్యేక ట్రాక్‌లు

కాకినాడలో సైక్లింగ్ కోసం జేఎన్టీయూకే నుంచి భానుగుడి వరకూ 3కిలోమీటర్ల మేర, వివేకానంద పార్కు చుట్టూ ఒక కిలోమీటర్ మేర సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. సైక్లింగ్ చేసేందుకు దూరం వెళ్లలేనివారు, సమయం సరిపోని వారు ఈ రెండు ట్రాక్‌ల్లో ఉదయం, సాయంత్రం సైక్లింగ్ సాధన చేస్తున్నారు.

సైక్లింగే కాదు సేవ కూడా..

గోదావరి సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సైక్లింగ్‌తోపాటు పలు అవగాహన కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు సైతం చేపడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటుతున్నారు. పేద విద్యార్థులకు సైకిల్స్, బుక్స్, భోజనం ప్లేట్లు అందించి తోడ్పాటునందిస్తున్నారు. వీటితోపాటు క్యాన్సర్, ఆరోగ్యంపట్ల పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.



ఆంధ్రజ్యోతి, కార్పొరేషన్(కాకినాడ)/కాకినాడ రూరల్/జీజీహెచ్(కాకినాడ):

సైక్లింగ్.. ఉరుకుల పరుగుల జీవితంలో రిలీఫ్‌నిచ్చే వ్యాయామం ఇది.. ఆసక్తి ఉండాలే గానీ సైకిల్ తొక్కితే ఆనందం, ఆరోగ్యం కలిసొస్తాయి. ఒకప్పుడు ఎంత దూరమైనా సైకిల్‌పై వెళ్లి పనులు చక్కబెట్టుకుని వచ్చేవారు.. అలా సైకిల్ తొక్కడంవల్ల ఆరోగ్యంగా ఉండేవారు. ఇదొక వ్యాయామం లాగా ఉపయోగపడి రోజంతా చురుగ్గా ఉండడంతోపాటు వారికి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటారు. కాలక్రమంలో సైకిళ్లను ఉపయోగించేవారు తగ్గారు. విద్యార్థులు, చిన్నారులు తప్ప పెద్దలు ఆ జోలి కెళ్లడం లేదు..

సమాజంలో సైకిళ్లు తొక్కేవాళ్లు తగ్గారు కానీ ఇటీవల కాలంలో కొందరు ఆసక్తి ఉన్న వ్యక్తులు గ్రూపులుగా ఏర్పడి సైక్లింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేసి క్లబ్ పేరిట సైక్లింగ్ చేస్తున్నారు. రోజువారీగానే కాకుండా వారాంతాల్లో దూరప్రాంతాలకు సైతం వెళ్తున్నారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ సిటీ, మిగిలిన చోట్ల కూడా ఈ తరహా సైక్లింగ్ చేసేవారు కనిపిస్తుంటారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉన్నారు, వైద్యులు ఉన్నారు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు..గృహిణులు కూడా ఉన్నారు..

కాకినాడలో గోదావరి సైకిల్ క్లబ్

కాకినాడలో 2017లో కొంతమంది స్థానికులు ఆరోగ్య సంరక్షణకోసం సైక్లింగ్ చేయడం ప్రారంభించారు. అలా నలుగురితో గోదావరి సైకిల్ క్లబ్ ప్రారంభించారు. ఇప్పుడు 60మంది సభ్యులయ్యారు. ఇందులో ప్రముఖ వైద్యులు, జిల్లాస్థాయి అధికారులు, వ్యాపారస్తులు, మహిళలు కూడా ఉన్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ, డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ట్రస్ట్ ఆస్పత్రి అధినేత డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సహా ఇంకా ఎంతోమంది నిష్ణాతులైన వైద్యులు ఈ సైక్లింగ్ క్లబ్‌లో భాగస్వామ్యమై ఉన్నారు. ఇందులో సభ్యులంతా రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 8.30 గంటల వరకు సైక్లింగ్ చేస్తుంటారు. గతంలో కాకినాడ బీచ్ రోడ్డు నుంచి ఉప్పాడ, అద్దరిపేట వరకు సైక్లింగ్ చేసేవారు. ఆ రోడ్డు ఛిద్రమవడంతో కాకినాడ-కత్తిపూడి రహదారిలో గొల్లప్రోలు టోల్‌గేట్ వరకు వెళ్లి వస్తుంటారు. కాకినాడ నుంచి ఒక్కోసారి కురాడ, విరవాడ, కాపవరం ఇలా కాకినాడ పరిసర ప్రాంతాల్లో సైక్లింగ్ చేస్తుంటారు.

- సైక్లింగ్‌తో ఆరోగ్యానికి మేలంటున్న వైద్యులు
- కాకినాడలో గోదావరి సైక్లింగ్ క్లబ్ ఏర్పాటు
- 60 మంది వరకు సభ్యులు.. యువకులు, వృద్ధులు, మహిళలు కూడా..
- ప్రతిరోజూ పదుల సంఖ్యలో సైకిల్‌యానం

రాండోనీర్లు.. సూపర్ రాండోనీర్లు..



క్లబ్ సభ్యులు రోజూ 40కిలోమీటర్లు, వారంతాల్లో 100 కిలోమీటర్లకు పైగా సైక్లింగ్‌కి వెళ్తున్నారు. క్లబ్‌లో వేల కిలోమీటర్లు సునాయాసంగా రైడ్ చేసిన సభ్యులు కూడా ఉన్నారు. ఐదుగురు సభ్యులు 200, 300, 600 కిలోమీటర్లు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం సైక్లింగ్ చేసిన సభ్యులు ఉన్నారు. పరిమిత సమయంలో 200 కిలోమీటర్లు దాటి సైక్లింగ్ చేసిన వాళ్లను రాండోనీర్లు అంటారు. వీటిని పలుసార్లు పూర్తి చేసిన వారిని సూపర్ రాండోనీర్లుగా అభివర్ణిస్తారు. కాకినాడలోని గోదావరి క్లబ్‌లో ఈ రాండోనీర్లు, సూపర్ రాండోనీర్లు కూడా ఉన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం పదిలం



ఆరోగ్యానికి సైక్లింగ్ ఎంతో దోహదపడుతుంది. మా వైద్యులం కొందర కలిసి గోదావరి సైక్లింగ్ క్లబ్‌లో చేరాం. మా గ్రూపులో స్టాన్లీ అనే వ్యక్తి ఆధ్వర్యంలో వృద్ధులు, మహిళలు సైక్లింగ్ చేస్తూ ఆరోగ్యవంతులు అవుతున్నారు. కొవిడ్‌కు ముందు విశాఖపట్నం, విజయవాడ కూడా సైక్లింగ్ చేసి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ప్రతి ఆదివారం బృందంగా వెళ్తుంటాం. సైక్లింగ్ చేయడం వల్ల మోకాళ్లపై ఒత్తిడి పడదు. గుండె పనితీరు మెరుగుపడుతుంది. మొత్తంగా అవయవాల్లో చలాకీతనం వస్తుంది. మా బృందంలో వైద్యులు డాక్టర్ సానా ప్రవీణ్, డాక్టర్ వై.రామకృష్ణ, డాక్టర్ ఆనంద్, డాక్టర్ విజయకృష్ణ, డాక్టర్ వెంకటాచలం, డాక్టర్ నారాయణమూర్తి, డాక్టర్ కిరణ్, డాక్టర్ హరీష్ ఉన్నారు.

● డాక్టర్ అరుణాదిత్య, కాకినాడ

వేయి కిలోమీటర్లు పూర్తిచేసిన
తొలి మహిళను నేనే





నాకు 46 సంవత్సరాలు. నేనో గృహిణిని. గతంలో వాకింగ్ చేసేదాన్ని అనారోగ్య సమస్యలు ఉండడంతో వైద్యుడు సైక్లింగ్ చేయాలని సూచించారు. అనారోగ్యాన్ని జయించడానికి సైక్లింగ్ చేయమని డాక్టర్ ఇచ్చిన సలహా నా జీవితాన్ని మార్చేసింది. నా అనారోగ్య పరిస్థితులు కూడా అధిగమించాను. ప్రారంభంలో రోజుకు 10 నుంచి 20 కిలోమీటర్లు వెళ్లేదాన్ని. తర్వాత పోటీలకోసం కాకినాడ నుంచి అన్నవరం, చేబ్రోలు వెళ్లొచ్చేదాన్ని. సూపర్ రాండోనీర్స్గా పూర్తి చేశా. అనంతరం అమరావతి రాండోనీర్ వాళ్లు వెయ్యికిలోమీటర్లు పోటీ నిర్వహించారు. ఇందులో గుంటూరులో మొదలై కరీంనగర్‌కు 75గంటల్లో వెళ్లి రావాలి. ఆంధ్ర రాష్ట్రంలో ఈ రెండూ పూర్తి చేసిన తొలి మహిళను నేనే. హైవే మీద రాత్రిళ్లు భారీ వాహనాలు వెళ్తున్నా ధైర్యంగా పూర్తి చేశా. సైకిల్‌కు పంక్చర్ వేయడం, మరమ్మతులు చేయడం కూడా నేర్చుకున్నా. వచ్చేఏడాది లండన్‌లో నిర్వహించే 1500 కిలోమీటర్ల పోటీలో పాల్గొంటా.

● కోనేరు అనిత, కాకినాడ

3 ఏళ్లలో 36 వేల కి.మీ..



సైక్లింగ్ అలవాటుగా మారింది.. మూడేళ్లలో 36వేల కిలోమీటర్లు సునాయాసంగా తొక్కేశాను. హైదరాబాద్ నాలుగుసార్లు, విజయవాడ ఆరుసార్లు, విశాఖపట్నం ఎనిమిదిసార్లు రైడ్ చేశాను. పారిస్ సంస్థ నిర్వహించిన పోటీల్లో కూడా మెడల్స్ అందుకున్నాను. 600, 300, 200 పూర్తి చేసిన వారిని సూపర్ రాండోనీర్లు అంటారు. పారిస్‌లో నాలుగేళ్లకోసారి నిర్వహిస్తారు. అది నేను నాలుగుసార్లు పూర్తి చేశాను. 1500 కిలోమీటర్ల పోటీకి సిద్ధమవుతున్నా.

-యండమూరి ప్రకాష్‌రావు, కాకినాడ

త్వరగా బరువు తగ్గొచ్చు



సైక్లింగ్ ద్వారా త్వరగా బరువు తగ్గడానికి ఆస్కారం ఉంటుంది. ఇంకా చాలా ఆరోగ్యపరమైన ఉపయోగాలున్నాయి. మంచి శరీరాకృతి ఏర్పడడంతోపాటు మధుమేహం, రక్తపోటు అదుపులోకి వస్తాయి. ఉదయాన్నే సైకిల్ తొక్కడంవల్ల రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుంది. నేను కూడా 1500 కిలోమీటర్ల పోటీకి సిద్ధమవుతున్నా.

● దేవు రాజేశ్వర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

జేఎన్‌టీయూకేలో ఐఐఐపీటీ ఆధ్వర్యంలో..
ఫూల్ క్యాంపస్ డ్రైవ్



క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులకు సూచనలిస్తున్న ఐఐఐపీటీ డైరెక్టర్ డాక్టర్ బీటీ కృష్ణ

- 120మంది హాజరు కాగా 27మంది ఉద్యోగాలకు ఎంపిక

జేఎన్టీయూకే, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్‌యూకేలోని సెనేట్‌హాల్లో ఐఐఐపీటీ డైరెక్టరేట్ డైరెక్టర్ డాక్టర్ బీటీ కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పూల్ క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించారు. దీనిలో మెకానికల్, కెమికల్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) విద్యార్థులకు తిరుచ్చిలోని శ్రీ సాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చేపట్టిన క్యాంపస్ డ్రైవ్‌కు వర్సిటీ, డిగ్రీ కళాశాలలనుంచి 120మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 27మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు బీటీ కృష్ణ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు దేశంలోని కంపెనీకి సంబంధించిన 35 ప్రాజెక్టుల్లో ఎక్కడైనా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు.

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి హుండీ ఆదాయం రూ.39,02,348



ఆలయంలో స్వామివారి హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

అంతర్వేది, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం హుండీల ఆదాయం లెక్కించారు. ప్రధాన ఆలయంలోని హుండీల ద్వారా రూ.38,29,465, గుర్రాలక్కమ్మవారి హుండీ ఆదాయం రూ.16,780, అన్నదాన హుండీ ద్వారా రూ.56,103 మొత్తం హుండీల ద్వారా ఆదాయం రూ.39,02,348 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో ఎంపీటీసీ భైరా నాగరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం 'సోనోవిజన్'లో లక్కీడ్రా ద్వారా విజేతల ఎంపిక



లక్కీడ్రాలో పాల్గొన్న సంస్థ ఎండీ భాస్కరమూర్తి, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జేఎన్‌రోడ్ లోని సోనోవిజన్ షోరూంలో సోమవారం లక్కీడ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. సంక్రాంతి,రిపబ్లిక్‌డే సందర్భంగా రాజమహేంద్రవరం, కాకినాడ షోరూంల్లో కొనుగోళ్లు చేసిన కస్టమర్లకు ఏర్పాటు చేసిన ఈ డ్రా కార్యక్రమానికి రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లక్కీ డ్రాలో మొదటి బహుమతి మారుతి ఆల్టోకారును పిఠాపురానికి చెందిన ఎన్.అన్నపూర్ణ గెలుచుకోగా రెండో బహుమతి ఎల్‌ఈడీ టీవీని రాజమహేంద్రవరానికి చెందిన కె.చైతన్య, మూడో బహుమతి రిఫ్రిజిరేటర్‌ను రాజమహేంద్రవరానికి చెందిన అఖిల్‌కుమార్, నాలుగో బహుమతి వాషింగ్ మెషీన్‌ను కాకినాడకు చెందిన అల్లం కుమార్ గెలుపొందారు. సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి మాట్లాడుతూ తమసంస్థ ద్వారా తక్కువ ధరల్లో నాణ్యమైన గృహోపకరణాలను అందిస్తూ నమ్మకమైన సర్వీసు ఇవ్వడంలో ముందంజలో ఉన్నామన్నారు.

అన్నవరం దేవస్థానంలో..
ఆదాయం పెంపు, వ్యయాల తగ్గింపుపై ప్రత్యేక కమిటీ

- అన్ని విభాగాల ఏఈవోలు, నలుగురు సూపరింటెండెంట్, సహాయ కమిషనర్‌తో కమిటీ
- దేవస్థానంలో ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి అతలాకుతలం

అన్నవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానంలో ఆర్థిక పరిస్థితి అతలాకుతలంగా మారడంతో ఈవో వీర్ల సుబ్బారావు ప్రత్యేక కమిటీని నియమించారు. సహాయ కమిషనర్, అన్ని విభాగాల ఏఈవోలు, నలుగురు సూపరింటెండెంట్‌లతో ఈ కమిటీని నియమించారు. వీరంతా దేవస్థానం ఆదాయం పెంపు, వ్యయాల తగ్గింపుపై విశ్లేషణ చేసి ఒక నివేదికను తయారు చేసి ఇవ్వాలని, దీన్ని దేవదాయ కమిషనర్ అనుమతితో అమలు చేసేలా ఆలోచన చేస్తున్నారు. దేవస్థానానికి ఏటా రూ.170కోట్లు ఆదాయం వస్తున్నా సిబ్బంది జీతాలు, పెన్షన్ల రూపంలో రూ.80కోట్లు ఖర్చవుతుంది.ఇక ప్రసాదం తయారీ, వ్రతవిభాగంలో, ఇతర విభాగాలకు అవసరమైన రసవర్గాల కొనుగోలు, శానిటేషన్ నిర్వహణ, ఇంజనీరింగ్ విభాగాల పనులతో ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగియకుండానే ఖర్చులు బడ్జెట్‌ను మించిపోయి సప్లమెంటరీ బడ్జెట్ అనుమతికోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా గతేడాది రూ.4కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను విత్‌డ్రా చేసి వినియోగించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇదేవిధంగా ఉంటే భవిష్యత్‌లో జీతాలు, పెన్షన్లను సకాలంలో చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో అప్రమత్తమైన ఈవో ఈ నిర్ణయం తీసుకున్నారు. వారంరోజుల్లో నివేదికను సమర్పించాలని కోరినా అధ్యయనం, నివేదిక తయారీకి ఇంకా సమయం పట్టువచ్చునని అధికారులు పేర్కొంటున్నారు.

మాజీ సైనికుల సమస్యలపై
రేపు 'స్పర్శ'

- రాజమహేంద్రవరంలో కార్యక్రమం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోని మాజీ సైనికుల సమస్యలపై ఈనెల 29న రాజమహేంద్రవరం హోటల్ రివర్ బేలో స్పర్శ ఔట్‌రీచింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి కెప్టెన్ పి.సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అలహాబాద్ సీడీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరికి చెందిన మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువులు, మాజీ సైనిక సంఘాల వారంతా తమ సమస్యలు తెలపవచ్చన్నారు. బ్రిగేడియర్ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ వెంకటరెడ్డి హాజరై సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తారన్నారు.

875 కిసాన్ డ్రోన్లతో యాంత్రీకరణ కేంద్రాలు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడులు తగ్గించడానికి, పంటలకు ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడానికి ఈఏడాది 875 కిసాన్ డ్రోన్లతో గ్రామస్థాయి యాంత్రీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. రూ.10లక్షల విలువైన ఒక్కో యూనిట్‌కు 80% సబ్సిడీ, 50% బ్యాంక్ లోన్, రూ.70 కోట్ల రాయితీతో ఏర్పాటు చేస్తామని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అద్దె ప్రాతిపదికన ఈ యంత్ర సేవలు అందించడానికి 4-5మందితో రైతు సంఘాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

నూతన దేవదాయ కమిషనర్‌ను కలిసిన
అన్నవరం వ్రతపురోహిత సంఘం



కమిషనర్‌ను కలిసిన దేవస్థానం వ్రతపురోహిత సంఘ నాయకులు

అన్నవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దేవదాయ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.రామచంద్రమోహన్‌ను అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి వేదాశీర్వచనాలు అందజేశారు. అన్నవరం దేవస్థానంలో అస్తవ్యస్తంగా ఉన్న వ్రతపురోహిత వ్యవస్థను 2010లో రామచంద్రమోహన్ ఈవోగా వ్యవహరించిన సమయంలో ప్రక్షాళన చేసి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు, ఉద్యోగవిరమణ పురోహితులకు పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పించారు. దీంతో వారికి ఆయనతోప్రత్యేక అనుబంధం ఏర్పడింది. ఈ సందర్భంగా రామచంద్రమోహన్ అన్నవరంలో వ్రతవిభాగం చాలా కీలకమైనదని, ఆలయ ప్రతిష్ఠ కాపాడేందుకు వ్రతపురోహితులు పాటుపడాలని సూచించారు. వ్రతపురోహిత సంఘ అధ్యక్షులు చామర్తి కన్నబాబు, మొకరాల రాజేష్, మంథా రాంబాబు గురుమూర్తి తదితరులున్నారు.

కుష్ఠురహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- డీఆర్వో టి. సీతారామ్మూర్తి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్వో

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాను కుష్ఠురహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని డీఆర్వో టి.సీతారామ్మూర్తి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించే స్పర్శ కుష్ఠువ్యాధి అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఆర్వో మాట్లాడుతూ కుష్ఠువ్యాధిగ్రస్తుల పట్ల ప్రజల్లో వివక్ష లేకుండా చూడాలన్నారు. జిల్లా కుష్ఠునియంత్రణ అధికారిణి డాక్టర్ వసుంధర, అధికారులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన శిబిరం ప్రారంభం

జీజీహెచ్(కాకినాడ) జనవరి 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ భరోసా-దివ్యాంగుల పెన్షన్ పథకంలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రస్తుతం పెన్షన్‌కు అర్హులైన లబ్ధిదారుల సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన శిబిరాన్ని కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో సోమవారం ప్రారంభించారు. దృష్టిలోపం, వినికిడి లోపం, మానసిక వికలాంగులకు సంబంధించి ఆయా విభాగాల ద్వారా ఈ క్యాంప్‌నకు సంబంధించి అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని ఆస్పత్రి డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. ప్రతి విభాగానికి ఇద్దరు వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొంటారన్నారు. సదరం కేంద్రంలోకి వెళ్లి ఆధారు కార్డు ద్వారా ఓపీ చీటి నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం కలర్ కోటెడ్ చీటీని తీసుకోవాలన్నారు. కంటి విభాగం కోసం గులాబీ రంగు టోకెన్, ఈఎన్‌టీ విభాగం కోసం ఆకుపచ్చ టోకెన్, సైక్రియాట్రీ విభాగంకోసం నీలం టోకెన్ తీసుకుని సంబంధిత వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, సైకియాట్రీ వైద్య నిపుణులు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ యమున పాల్గొన్నారు.

30 నుంచి భావనారాయణస్వామి తిరునాళ్లు

సర్పవరంజంక్షన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 30 నుంచి మాఘమాస మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో ఎం.లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం సర్పవరం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 23 వరకు మాఘమాస మహోత్సవాలు జరుగుతాయని, ఇందులోభాగంగా నాలుగు ఆదివారాలు భావనారాయణస్వామి తిరునాళ్లు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 2న మొదటి ఆదివారం తిరునాళ్ల, 4న రథ సప్తమి వేడుకలు, 8న భీష్మ ఏకాదశి, 9న రెండో ఆదివారం తిరునాళ్ల, 12న మాఘ పౌర్ణమి, 16న మూడో తిరునాళ్ల, 23న నాలుగో తిరునాళ్ల నిర్వహించేందుకు భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నాలుగు ఆదివారాల్లో జరిగే తిరునాళ్లకు వేలాదిమంది భక్తులు స్వామవారిని దర్శించుకునే అవకాశం ఉందని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం కోసం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

సాగు చేసుంటే బాగు!

- ఏజెన్సీలో మిర్చికి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతుల ఆసక్తి
- ఈ ఏడాది ఆశాజనకంగా మిర్చి సాగు
- ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి
- ఎక్కువ పంట వేసుంటే ఆదాయం పెరిగే అవకాశం



గన్నవరంలో ఆరబెట్టిన మిర్చి పంట

ఎటపాక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో గత మూడేళ్ల నుంచి వరుస నష్టాలను చవిచూస్తున్న మిర్చి రైతులు ఈ ఏడాది మక్కువ చంపుకుని మిర్చికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ఆసక్తి చూపారు. ప్రధానంగా లంక పొగాకు, మినుము, మొక్కజొన్న, జామాయిల్ సాగు బాట పట్టారు. అయితే ప్రస్తుతం మిర్చి దిగుబడి బాగున్నా సాగు అంతంత మాత్రమే ఉంది. గత మూడేళ్లుగా మిర్చి పంటకు నల్లితామర పురుగు, వైరస్ ప్రభావంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. కనీసం పెట్టుబడులు కూడా రాక రూ.లక్షల్లో నష్టాలు మూట గట్టుకున్నారు. దాంతో ఏజెన్సీలో ఈ ఏడాది మిర్చి రైతులు పంట సాగుకు సాహసించని పరిస్థితి. గతేడాది ఎటపాక మండలంలో 3,300 ఎకరాల్లో మిర్చిపంట సాగు చేయగా, ఈ ఏడాది కేవలం 1,800 ఎకరాల్లో మాత్రమే పంట సాగు చేశారు. ఏజెన్సీలో గతంలో పది నుంచి పదిహేను ఎకరాల వరకు సాగు చేసిన మిర్చి రైతులు నష్టాలతో ఏడాదికి కేవలం 2, 3 ఎకరాల్లో మాత్రమే పంటను సాగు చేశారు. ఎకరం సాగుకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడులు అయినట్టు రైతులు పేర్కొంటున్నారు.

వ్యాపించని వైరస్‌లు

అయితే ఈ ఏడాది పంటకు నల్లితామర పురుగు ఆశించలేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఎలాంటి వైరస్‌లు వ్యాపించ లేదని, దాంతో పంట దిగుబడి ఆశాజనకంగా ఉందంటున్నారు. ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పంట ఆశాజనకంగా ఉంది



గత ఏడాది 12 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. రూ 12 లక్షలు నష్టపోయా. ఈ ఏడాది కేవలం 3 ఎకరాల్లో సాగు చేశాను. పంట ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

వల్లభనేని కిషోర్‌కుమార్, రైతు, గన్నవరం

ఏజెన్సీలో గత వారం రోజుల నుంచి మిర్చి కోతలు నిర్వహిస్తున్నారు. అయితే జనవరి మొదటి వారంలో క్వింటా మిర్చి 15వేల వరకు ధర పలికి, ఆ తర్వాత తగ్గింది. ధర పడిపోవడంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ప్రస్తుతం మిర్చి పంట కిలో రూ.120 నుంచి రూ.130 వరకు పలుకుతోంది. ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుంటే బాగుండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

అమలాపురంలో దొంగలు బీభత్సం

- ఆంధ్రజ్యోతి కార్యాలయంలో సామగ్రి ధ్వంసం.. నగదు అపహరణ
- పక్కనే ఉన్న చాందిసి క్లినిక్‌లో చోరీ
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్



ఆంధ్రజ్యోతి కార్యాలయంలో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

అమలాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణ నడిబొడ్డు గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు పడ్డారు. కార్యాలయంలో ఉన్న బీరువాను బద్దలు గొట్టి రూ.85వేల నగదును అపహరించుకుపోయారు. పక్కనే ఉన్న మరో క్లినిక్‌లో కూడా దొంగలు చొరబడి నగదు అపహరించుకుపోయారు. అమలాపురం పట్టణ టౌన్ పోలీసుస్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఈ రెండు భవనాల్లోను దొంగలు చొరబడి బీభత్సం సృష్టించారు. ఆంధ్రజ్యోతి కార్యాలయం ప్రధాన ద్వారం తాళాలను ధ్వంసం చేసి లోనికి ప్రవేశించారు. కార్యాలయంలో ఉన్న ఇనుప బీరువా తలుపులు ధ్వంసం చేసి లోపల సీక్రెట్ లాకరులో ఉన్న అడ్వర్‌టైజ్‌మెంట్‌కు సంబంధించిన నగదు రూ.85వేలను దోచుకువెళ్లారు. బీరువాలో ఉన్న సామాను అంతా చిందరవందరచేసి సామగ్రిని ధ్వంసం చేశారు. అదేవిధంగా కార్యాలయానికి పక్క భవంతిలో ఉన్న చాందిసి క్లినిక్ షట్టర్ తాళాలు పగులకొట్టి లోనికి వెళ్లిన దొంగలు డ్రాయర్‌ను ధ్వంసం చేసి వాటిలో ఉన్న సుమారు రూ.35వేల నగదును అపహరించుకుపోయారు. ఈ దొంగతనాలు పోలీసు స్టేషన్‌కు ఎదురుగానే జరగడం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 2రోజుల క్రితం సెంటర్‌లోనే ఉన్న పూలరంగడు షాపులో కూడా దొంగతనం జరిగింది. ఇలా పట్టణ నడిబొడ్డు అయిన సెంటర్‌లోనే దొంగలు రెచ్చిపోయి దోపిడీలకు పాల్పడుతున్న తీరును ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ ఎ.వెంకటేశ్వరరావు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ కార్యాలయాన్ని పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. పట్టణ సీఐ పి.వీరబాబు, క్రైమ్ సీఐ గజేంద్రకుమార్, క్లూస్‌టీమ్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసినట్టు వారు తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్‌తో క్రైమ్ సీఐ

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం

కొవ్వూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. సోమవారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో బ్రాహ్మణ రేవు గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 మధ్య ఉంటుందన్నారు. ఆరికిరేవుల వీఆర్వో ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.



గోదావరి నదిలో పోలీసులు గుర్తించిన మృతదేహం

దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

తునిరూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను కాకినాడ జిల్లా తుని రాజా గ్రౌండ్‌లో సోమవారం వాలీబాల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బోడపాటి శివదత్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. దివ్యాంగుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే తమ ముందున్న లక్ష్యం అని శివదత్ పేర్కొన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు అంగదుర్గాప్రశాంతి మాట్లాడుతూ పారా వాలీబాల్ 4వ విడత రాష్ట్రస్థాయి పోటీలను తునిలో ప్రారంభించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. దీని ద్వారా దివ్యాంగులలో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు తుని చేరుకున్నారు. ఈ పోటీలు మూడురోజుల పాటు జరగనున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ వి.వేణు, అసోసియేషన్ సెక్రటరీ సీహెచ్.గణేష్, జాయింట్ సెక్రటరీ డి.స్వరూప్, ట్రెజరర్ జెఎస్ సంతోష్‌రావు తదితరులు పాల్గొన్నారు.



తునిలో దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులు

నాటిక పోటీల్లో విజేతలకు బహుమతులు



ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన స్వేచ్ఛ నాటికలో ఓ సన్నివేశం

పెద్దాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లిలో 3 రోజులపాటు నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతి ప్రదానం చేశారు. ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ప్రదర్శించిన స్వేచ్ఛ నాటిక నిలిచింది. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, జీవీఆర్.స్వామి, డి.రాధాకృష్ణ వ్యవహరించారు. విజేతలను కమిటీ తరుపున జీఎస్ఆర్.స్వామి ప్రకటించారు. ద్వితీయ ఉత్తమ నాటికగా మిత్ర క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఇది రహదారి కాదు నిలిచింది. ఉత్తమ నటులుగా స్వేచ్ఛ నాటికలో నటించిన ఆనంద్, గోకాడ వెంకట్, ఉత్తమ నటిగా రాత నాటికలో నటించిన వాగ్దేవి, ఉత్తమ రచయితగా ఆకురాతి భాస్కర్, ఉత్తమ దర్శకుడిగా బీఎస్.రెడ్డి, రంగాలంకరణకు ఫణి, ఆహార్యంకు పి.వేశన, సంగీతం అవార్డులు సురభి నాగరాజుకు దక్కాయి. కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, గౌరవాధ్యక్షుడు ఇందన బ్రహ్మానందం, కొత్తిం స్వామినాథన్, పాపేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి సొసైటీలో రూ.104 కోట్ల అవినీతి

- గుర్తించిన 51వ విచారణ కమిటీ
- పొలం లేకపోయినా, చనిపోయిన వారి పేర్లు మీద సొమ్ములు డ్రా చేసిన సొసైటీ అధికారులు
- అధికారులను నిలదీసిన రైతులు



అధికారులను నిలదీస్తున్న రైతులు

కిర్లంపూడి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.104 కోట్ల 18 లక్షల 10వేల 572 అవినీతి జరిగినట్టు 51వ విచారణ కమిటీ గుర్తించిందని సొసైటీ అధికారులు వెల్లడించారు. మండల కేంద్రమైన కిర్లంపూడిలో సోమవారం సొసైటీ ఆవరణలో జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సొసైటీ సీఈవో పంపన వెంకటరమణ అధ్యక్షతన కోపరేటివ్ సొసైటీ పర్సనల్ ఇన్‌చార్జి ఎం.రంగనాయకులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రైతులు పాల్గొన్నారు. సీఈవో వెంకటరమణ మాట్లాడుతూ రైతులపై ఏఒక్క రూపాయి భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రైతులు అధికారులను నిలదీస్తూ వ్యవసాయ భూమి లేని వారికి కూడా రుణాలు ఇచ్చినట్టు లక్షలాది రూపాయిలు చూపించడం, అలాగే చనిపోయిన వారిపేర్లపై రుణాలు తీసుకుని సొసైటీ చుట్టూ రైతులను తిప్పారని గగ్గోలు పెట్టారు. అలాగే 51 ఎంక్వైరీ విచారణ కమిటీ పేరు చెప్పి 18 నెలలు సాగదీశారన్నారు. బూరుగుపూడి, సింహాద్రిపురం, కిర్లంపూడి, జగపతినగరం రైతులు రాజకీయం జోక్యం ఉద్యోగుల బరితెగింపుతో సొసైటీలో అక్రమాలు శృతి మించాయన్నారు. రైతులను మోసంచేసి అడ్డదారిన కోట్లు కొల్లగొట్టారన్నారు. ఇకనైనా వారిపై చర్యలు తీసుకుని సొమ్ములు రికవరీ చేయాలన్నారు. దీనిపై పెద్దాపురం డివిజనల్ సహకార అధికారి కె.పద్మ విచారణ జరిపి కాకినాడ జిల్లా సహకార అధికారి జి.వెంకటకృష్ణకు నివేదిక అందించడం జరిగిందన్నారు. ఈ మహాజనసభ నిర్వహించిన నేపథ్యంలో ప్రత్యేకాధికారి సహకార రిజిస్ట్రార్ రంగనాయకులు వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి నగదు నిల్వలో తేడాలు, జీతాల బకాయిల చెల్లింపుల్లో అక్రమాలు వెలుగు చూశాయన్నారు. డిపాజిట్లు, చెల్లింపులు వంటివి బకాయిలు వసూలు చేసిన రశీదు పుస్తకంలో నమోదు చేయలేదన్నారు. సీఈవో వెంకటరమణ మాట్లాడుతూ కిర్లంపూడి సొసైటీ మాజీ చైర్మన్ స్వర్గీయ ఏ.సూర్యకుమారి, కిర్లంపూడి సొసైటీ మాజీ చైర్మన్ సీహెచ్ రాజ్‌కుమార్, ప్రత్తిపాడు డీసీసీ బ్రాంచ్ మాజీ మేనేజర్ మురళీకృష్ణ, వైఎస్ నాగేశ్వరరావు, డీసీసీబీ ప్రత్తిపాడు సూపర్‌వైజర్ వివివిడీఆర్ ప్రసాద్,జేవీ మోహనరావు, ఎం.నరసింహమూర్తిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. రైతులకు ఇచ్చిన రుణాలు రూ. ఎనిమిది కోట్లు వసూలు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపిందని మొత్తం రూ.30 కోట్లు ఇంకా రికవరీ కావాల్సి ఉండగా, వాటిని వసూలు చేస్తామని చెప్పడంతో రైతులు ఒక్కసారిగా రుణమాఫీ చేసి తీరాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ తీర్మానం కలెక్టర్‌కు నివేదించడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

మావోయిస్టు నేత చందన మిశ్రా అరెస్టు



చందన మిశ్రా (ఫైల్)

చింతూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ దండ కారణ్య నాయకుడు చందన మిశ్రా అలియాస్ నగేష్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చింతూరు ఎస్ఐ పేరూరి రమేష్ తెలిపిన వివరాలివి.. తెలంగాణలోని హైద రాబాద్‌కు చెందిన చందన మిశ్రా 2018లో మావోయిస్టుల్లో చేరాడు. అనతికాలంలోనే పార్టీలో అంచెలంచెలుగా ఎదిగాడు. 2018లో చందన మిశ్రాను చింతూరు డివిజన్ ఎటపాక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం జైలు నుంచి వచ్చాక కూడా మావోయిస్టుల కార్యకలా పాల్లో చురుకుగా పాల్గొన్నాడు. దీంతో తిరిగి చింతూరు పోలీసులు ఈనెల 25న అదుపులోకి తీసుకొని సోమవారం మరోసారి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

రేపు పిఠాపురంలో నృత్యకళా ప్రదర్శన

పిఠాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29న పిఠాపురంలో పశ్చిమబెంగాల్ సంప్రదాయ జానపద నృత్యరూపకం పురూలియా చౌ నృత్యకళా ప్రదర్శన జరగనుంది. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలోని పీఠికాపుర కళావేదికపై ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు సంగమేశ్వర సంగీత సమాఖ్య ప్రతినిధులు తెలిపారు.

డీమార్ట్‌లో కాలం చెల్లిన సరుకుల విక్రయం

- ఆందోళనకు దిగిన బాధితులు



ఆందోళన చేస్తున్న యువకులతో మాట్లాడుతున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట డీ మార్ట్ వద్ద సోమవారం గందరగోళం నెలకొంది. కొంతమంది వినియోగదారులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే ఆదివారం రోజున కిషోర్ కుమార్ అనే వ్యక్తి వచ్చి 40 ఫ్రూటీ డ్రింక్స్ కేసును తీసుకున్నాడు. దాన్ని ఇంటికి తీసుకుని వెళ్లి పిల్లలతో కలిపి తాగారు. తీరా ప్యాక్‌ను పరిశీలిస్తే ఈనెల 8వ తేదీతో కాలపరిమితి ముగిసి ఉంది. దీంతో ఏదైనా జరుగుతుందేమోనని భయపడి రాత్రి 10 గంటల ప్రాంతంలో వ్యాపారసంస్థ వద్దకు వచ్చినప్పటికీ మేనేజర్ పట్టించుకోలేదు. దీంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదు చేశారు. సోమవారం వారు వచ్చి ఆ వ్యాపార సంస్థలోని సామాన్లు పరిశీలిస్తే ఆ డ్రింక్‌కు సంబంధించి కాలపరిమితి ముగిసినవి లేవని నిర్ధారించారు. ఇంతలో ఆ డ్రింక్ తాగిన వారిలో ఇద్దరికి పెదవుల్లో తిమ్మిర్లు వచ్చాయని, మరో ఇద్దరు పిల్లలకు విరోచనాలు అయ్యాయని బాధితులు చెబుతున్నారు. దీంతో వారంతా ఆందోళన చేయడంతో బొమ్మూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీమార్ట్ మేనేజర్‌ను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. దీనిపై విచారణ కొనసాగుతోంది.

వ్యక్తిపై దాడి కేసులో వైసీపీ నేతపై కేసు

సర్పవరం జంక్షన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడి కేసులో వైసీపీ నేత కడియాల చిన్నపై సోమవారం సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట గైగోలుపాడుకి చెందిన పెంకే శివపై అదే ప్రాంతానికి చెందిన చిన్నతోపాటు మరో ముగ్గురు కలిసి దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్ర గాయాలపాలైన సదరు వ్యక్తి ఆదివారం రాత్రి చికిత్స కోసం జీజీహెచ్‌లో చేరాడు. అక్కడి అవుట్ పోస్ట్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు శివ ఫిర్యాదు మేరకు చిన్నతో పాటు కడియాల సత్తిబాబు, పాలిక శ్రీను, అంజిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఫ్లెక్సీ చించివేతపై జరిగిన కొట్లాటలో దాడి జరిగింది.

తొండంగిలో గ్యాస్ సిలిండర్లు చోరీ

అన్నవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తొండంగి వైష్ణోదేవి గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. 96 నిండు సిలిండర్లు అపహరణకు గురైనట్టు నిర్వాహకుడు వడ్డాది ప్రసాద్ పేర్కొన్నాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

7 నుంచి బంగారు పాప ఉరుసు ఉత్సవాలు

కొత్తపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఏడో తేదీ నుంచి తొమ్మిది వరకు కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడ బషీర్‌బీబీ ఔలియా(బంగారుపాప) 70వ ఉరుసు ముబారక్ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు స్థానికము జువర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉరుసు ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు రానున్నారు.

‘29లోపు అర్హత గల ఏజెన్సీలు దరఖాస్తు చేసుకోవాలి’

కాకినాడ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాణీలక్ష్మీబాయి ఆత్మరక్ష పరిశీలన- ఆత్మరక్షణ కార్యక్రమంలో భాగముగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని బాలికా విద్యార్థుల శిక్షణ కార్యకలాపాల అమలు కోసం అర్హత గల ఏజెన్సీల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు సమగ్ర శిక్ష ఏపీసీ పి.వేణు గోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 లోపు కాకినాడ సమగ్రశిక్ష కార్యాలయంలో సమర్పించాలని ఏపీసీ సూచించారు. ఇతర వివరాలకు ఎస్ఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

భార్యను ఆసుపత్రిలో చేర్పించి వస్తుండగా.. మార్గ మధ్యలో ఫిట్స్‌తో భర్త మృతి



అప్పారావు మృతదేహం

అనపర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న భార్యను ఆసుపత్రిలో చేర్పించి తిరుగు ప్రయాణమైన భర్త మార్గ మధ్యలో మృతి చెందిన సంఘటన సోమవారం అనపర్తిలో చోటుచేసుకుంది. అనపర్తి అడిషనల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం చిన పొలమూరుకి చెం దిన వల్లం అప్పారావు(52) మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. అయితే అనారోగ్యం పాలైన తన భార్యను ఆసుపత్రిలో చూపించేందుకు సోమవారం రాజమహేంద్రవరం వెళ్లాడు. అక్కడి వైద్యులు ఆమెను ఆసుపత్రిలో ఉంచాలని చెప్పడంతో భార్యను ఆసు పత్రిలో చేర్పించి ఇంటికి పయనమ య్యాడు. ఇంతలో అనపర్తి శివారు లోని హీరో హోండా షోరూమ్ సమీపానికి వచ్చేసరికి ఫిట్స్ రావడంతో అప్పారావు మోటార్ సైకిల్‌ను ఆపి కల్వర్టుపై కూర్చునే ప్రయత్నం చేశా డు. అప్పటికే తీవ్రత ఎక్కువ కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం కావాలి

- భర్త ఇంటి ముందు భార్య ధర్నా



పినపళ్లలో భర్త ఇంటి ముందు ధర్నా చేస్తున్న మహిళ

ఆలమూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తనకు న్యాయం కావాలంటూ ఓ మహిళ భర్త ఇంటి ముందు దర్నాకు దిగింది. వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పినపళ్లకి చెందిన ఇల్లూరి రవికుమార్‌కు మండపేట మండలం ఏడిదకి చెందిన ఇళ్ల సత్యవతికి మూడేళ్ల క్రితం వివాహమైంది. అయితే వీరి కాపురం ఆరునెలలు సజావుగానే సాగినప్పటికీ.. అనంతరం విబేదాలు తలెత్తడంతో విడిపోయారు. అప్పటి నుంచి పలుమార్లు పెద్దల సమక్షంలో సర్దిచెప్పినా కాపురానికి తీసుకురావడానికి రవికుమార్ నిరాకరించాడు.దీంతో సత్యవతి భర్త ఇంటి ముందు సోమవారం ధర్నా చేసింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎం.అశోక్ మహిళా పోలీసును పంపించి వివరాలు సేకరించారు. అప్పటికే రవికుమార్ ఇంటికి తాళాలు వేసి వెళ్లిపోయినట్టు తెలిసింది.

ఎలక్ట్రీషియన్ డే

ముమ్మిడివరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో ఆదివారం ఎలక్ట్రీషియన్ల డేను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఎలక్ట్రీషియన్ నాయకులంతా కేక్‌ను కట్‌చేసి రోడ్‌షో నిర్వహించారు. ఎమ్మెల్యే సోదరుడు దాట్ల పృథ్విరాజ్, ఎలక్ట్రీషియన్ల యూనియన్ అధ్యక్షుడు సుంకర కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కె.రమణ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై సదస్సు

అమలాపురంటౌన్, జనవరి27(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమావళిని వివరిస్తూ అమలాపురం సర్‌సీవీ రామన్ పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ టీఎస్ ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను ఏవిధంగా అరికట్టవచ్చో తెలిపారు. సీఐ పి.వీరబాబు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి

ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

అల్లవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఆరోగ్యవంతమైన పాడి పశు పోషణకు, పాడి రైతులకు అధిక ప్రాధాన్యతనిచ్చి ఆర్థికంగా అండగా నిలుస్తోందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. డి.రావులపాలెంలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన లేగదూడల ప్రదర్శన, పశువైద్య శిబిరాలను ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. పశు సంవర్ధక శాఖ అమలు చేస్తోన్న సంక్షేమ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కొమ్మా వెంకట్రావు, సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి పర్యవేక్షణలో 232 పశువులకు టీకాలు, నట్టల నివారణ మందులు వేశారు. ప్రదర్శనలో పాల్గొన్న రైతులకు పాల క్యాన్లు, మందులు ఉచితంగా అందజేశారు. లేగదూడల ప్రదర్శనలో వంటెద్దు స్వామినాయుడు ఆవుదూడకు ప్రథమ బహుమతి, తిక్కా లక్ష్మణస్వామి గేదె దూడకు ద్వితీయ, బొబ్బిలి సత్యనారాయణ ఆవు దూడకు తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, ఆకుల లక్ష్మణరావు, సర్పంచ్ ఉండ్రు భగవాన్‌దాస్, తిక్కా వెంకటప్రసాద్, వేగిరాజు వెంకట్రాజు, ఎంపీటీసీ తిక్కా శేషుబాబు, డాక్టర్ మేడిద నారాయణరావు, డాక్టర్ శివతేజ, ఈసకోను సాంబశివరావు, నల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



లేగదూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

లోకేశ్ పాదయాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది

టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ల వెంకటరమణ, గోదావరి డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్

రాజోలు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కుప్పం నుంచి విశాఖపట్నం వరకు 3132 కిలోమీటర్ల మేర సాగిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్ర రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ, గోదావరి సెంట్రల్‌డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రాజోలులో సంతమార్కెట్ వద్దనున్న దివంగత ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి నియంతృత్వ పాలనకు చరమగీతం పాడేందుకు లోకేశ్ పాదయాత్ర ఎంతగానో దోహదపడిందన్నారు. వైసీపీ అరాచక పాలనపై గళం విప్పుతూ లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయ గతినే మార్చి వేసిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుందన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో దావోస్ పర్యటన విజయవంతమైందన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పలు దిగ్గజ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చాగంటి స్వామి, కాండ్రేగుల సత్యనారాయణ, కుసులుడు, ముప్పర్తి నాని, అడబాల విజయ్, కాండ్రేగుల భవానీ, కడలి వెంకటరమణ, మానుకొండ దుర్గాప్రసాద్, మటపర్తి లక్ష్మి, కాండ్రేగుల స్వామి, చెల్లింగి సత్యనారాయణ, పుల్లేటికుర్తి శివాజీపాల్గొన్నారు.



రాజోలులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఆసుపత్రి అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి



సమావేశానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ఆహ్వానిస్తున్న వైద్య సిబ్బంది

పి.గన్నవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం ఆసుపత్రి అభివృద్ధికి నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.పి.గన్నవరం సీహెచ్‌సీ నూతన అభివృద్ధి కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పి.గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి కార్పొరేట్ స్థాయిని తలపిస్తోందని, త్వరలోనే 50 పడకలు కాస్త 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. అనంతరం ప్రభుత్వ నిబంధనలు అనుసరించి చైర్మన్‌గా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కన్వీనర్‌గా సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు, మెంబర్లగా ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎంపీడీవో కె.వి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల వీరవెంకటసత్యనారాయణ, కోట రాజేంద్రప్రసాద్, గుడాల సంపతరావు, పితాని నాగమణి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, డాక్టర్ అప్పారి సూర్యనారాయణ, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, మట్టపర్తి రామకృష్ణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, తోలేటి సత్తిబాబు, సంసాని పెద్దిరాజు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, కె.సత్యనారాయణ రాజు, శేరు శ్రీనుబాబు, కేదాశి చిన్న, పేరిచర్ల నాగరాజు, గుత్తుల రామకృష్ణ, కడలి శంకరం, యడ్ల ఏసు, తాటికాయల శ్రీనివాసరావు, ప్రసన్న, సిబ్బంది చవటపల్లి మణితేజ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన నామన రాంబాబు



పి.గన్నవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు సీఎం చంద్రబాబునాయుడును అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇటీవల దావోస్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని ఏపీ బ్రాండ్‌ను ప్రపంచ నలుమూలల తెలియజేసిన సీఎంకు నామన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మనవరాలు వివాహానికి సీఎంకు అనంతరం నామన శుభలేఖ అందించి ఆహ్వానించారు. నామన వెంట రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు అక్కల రిశ్వంత్‌రాయ్, నామన శ్రీనివాస్ ఉన్నారు.

రహదారి కోసం గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతి

మలికిపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మలికిపురం చెరువుగుంట గ్రామస్తులు రహదారి కోసం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. వర్షాకాలంలో బురదలో ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ తహశీల్దార్‌కు కూడా వినతిపత్రం అందజేయమని, త్వరలో ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముత్యాల శ్రీనివాసరావు, పెచెట్టి వెంకటరమణ, ధనలక్ష్మి, ప్రభావతి, పుష్పావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో యువకుడి మృతదేహం

రాజోలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తాటిపాకలో ఆర్‌డబ్ల్యుఎస్ వాటర్ ప్రాజెక్టు చెరువులో అదే గ్రామానికి చెందిన గుమ్మడి కుమార్‌స్వామి (28) పడి మృతిచెందాడని ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ సోమవారం తెలిపారు. కుమార్‌స్వామి హైదరాబాద్‌లో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు తాటిపాకకు కుటుంబ సభ్యులతో వచ్చాడు. రెండురోజుల్లో వస్తానని హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులను ఈనెల26వ తేదీన పంపించేశాడు. శనివారం రాత్రి మంచినీటిచెరువులో ప్రమాదవశాత్తూ పడి మృతిచెందాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేష్‌కుమార్ తెలిపారు.

బకాయి వేతనాల కోసం యానిమేటర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట వెలుగు యానిమేటర్ల ధర్నా

అమలాపురం టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎనిమిది నెలలుగా వెలుగు యానిమేటర్లకు బకాయిపడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వెలుగు యానిమేటర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ.జ్యోతి అధ్యక్షతన జరిగిన ధర్నాకు సీఐటీయూ కోశాధికారి కె.కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎనిమిది నెలలుగా జీతాలు చెల్లించకపోతే ఆయా కుటుంబాలు ఎలా బతకాలని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్న యానిమేటర్లకు రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని ధ్వజమెత్తారు. రెండున్నర దశాబ్దాలుగా యానిమేటర్లుగా పనిచేస్తున్న వారిని కొన్నిచోట్ల తొలగించడాన్ని ఆమె తప్పుబట్టారు. కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, యానిమేటర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని సమాఖ్య పేరు మీద కాకుండా యానిమేటర్ల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని, పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారికి అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి, వేణు, సుబ్బలక్ష్మి, విజయ, మీరా, శ్యామల, సంతోషి, రత్నకుమారి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి..

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకత్వం సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి త్వరలోనే జిల్లా నాయకత్వంతో సమావేశం ఏర్పాటు చేస్తామని పీడీ హామీ ఇచ్చినట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి, అధ్యక్షురాలు డి.వెంకటలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, పి.రత్నకుమారి తెలిపారు.

ఆశా వర్కర్ల వేతన బకాయిలు చెల్లించాలి..

ఆశా వర్కర్లకు నెలల తరబడి జీతాలు చెల్లించడం లేదని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొరను కలిసి వినతిపత్రం అందించారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్తేరురాణి, కోశాధికారి సీతారత్నం మాట్లాడుతూ ఆశవర్కర్లకు ఆన్‌లైన్ పనిభారం పెరిగిపోయిందని, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.ఈశ్వరి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో వన్నె చింతలపూడి విద్యార్థుల ప్రతిభ

అమలాపురంరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశ స్థాయిలో నిర్వహించిన విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటి ద్వితీయ బహుమతిని దక్కించుకున్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు పి.రోహిణి, ఎస్.శశివదన రూపొందించిన మల్టీపర్పస్ సైక్లింగ్ మిల్ ప్రాజెక్టు అందర్నీ ఆలోచింపచేసింది. పుదుచ్చేరిలో ఈనెల21 నుంచి 25వరకు జాతీయస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. సైక్లింగ్ మిల్ ప్రాజెక్టు ద్వారా వ్యాయామమే కాకుండా ఏకకాలంలో పిండి జల్లించడం, ఇసుక జల్లించడం, బియ్యం, పప్పులు శుభ్రపరచడం ఇలా ఎన్నో పనులు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ ఈప్రాజెక్టును రూపొందించారు. పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి ఎ.నమశ్శివాయ చేతులమీదుగా ద్వితీయ బహుమతి ట్రోఫీని అందుకున్నారు. ఫ్రెంచ్ దేశస్తులు సైతం ప్రాజెక్టు రూపొందించిన తీరును ప్రశంసించి విద్యార్థులను అభినందించారు. గైడ్ టీచర్లుగా వ్యవహరించిన పి.శ్రీప్రకాష్, జి.నాగసత్యనారాయణలను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, జడ్పీటీసీ పందిరి శ్రీహరి రాంగోపాల్, ఎంపీపీ కుడుపూడి భాగలక్ష్మి, సర్పంచ్ నక్కా రాజారత్నరాజవాణి, పరమట శ్యామ్, డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా, ఉపవిద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో నాగబాబు బృందం ప్రదర్శన



అంబాజీపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర వేడుకల్లో అంబాజీపేట మండలం ముక్కామలకు చెందిన పసుపులేటి నాగబాబు, కుమార్ కళాకారుల బృందం మూడో సారి ప్రదర్శన అందించారు. ఆదివారం ఢిల్లీ జరిగిన గణతంత్ర వేడుకల్లో ఏపీ తరపున సమాచార శాఖ జేడీ పోతుల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐతణణఏటికొప్పాక బొమ్మలను ప్రదర్శించారు. శకటానికి ఇరువైపులా కోనసీమకు చెందిన 16మంది సభ్యులు వివిధ సంప్రదాయాలకు అనుగుణంగా బొమ్మలతో కూచిపూడి నృత్యం చేసుకుంటూ ప్రదర్శన నిర్వహించి అందర్నీ ఆకట్టుకున్నారు.

ఆసుపత్రి సమస్యలు తక్షణం పరిష్కరించండి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'ఆసుపత్రిలో మందుల్లేవు. అంబులెన్స్ మూలనపడింది. ఇంత జరుగుతున్నా మీకు ఏమాత్రం పట్టడంలేదు.' అంటూ ఎస్.యానాం గ్రామపెద్దలు సోమవారం వేదాంత-కెయిర్న్ ప్రతినిధులను నిలదీశారు. ఆంధ్రజ్యోతిలో ఈనెల25న 'ఎస్.యానాం పీహెచ్‌సీలో సీఎస్ఆర్ మందుల రగడ' శీర్షికన ప్రచురితమైన వార్తా కథనాన్ని చూపించారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రహదారి సమస్య పరిష్కరించాలన్నారు. ఈమేరకు వినతిపత్రాన్ని రవ్వ ప్రతినిధులు సతీష్‌రెడ్డి, సోమన్ దేవ్‌లకు సమర్పించారు. అనంతరం ఓఎన్జీసీ అన్‌లోడింగ్ పాయింట్ అధికారులను కలిసి అమలాపురం-ఎస్.యానాం రహదారి ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగి రాజేశ్వరీరాజా, ఎంపీటీసీ పెట్టా వెంకట్రావు, కూటమి నాయకులు పలచోళ్ల పద్మనాభం, అయితాబత్తుల రాజశేఖర్, లంకే భీమరాజు, ఉలిశెట్టి దొరబాబు, పలచోళ్ల బుజ్జి, మేకల నానాజీ, పలచోళ్ల నారాయణరావు, చీకట్ల శ్రీనివాసరావు, పినిశెట్టి నరసింహారావు, ఉండ్రు శామ్యూల్, అయితాబత్తుల మీరాకుమార్, మన్నే వాసు తదితరులు పాల్గొన్నారు.

కుక్క పిల్లను కాటేసి చంపిన తాచుపాము

ముమ్మిడివరం, జనవరి27(ఆంధ్రజ్యోతి): గేదెల్లంక గ్రామంలో భారీ తాచుపాము హల్‌చల్ చేసింది. నిమ్మన బాలకృష్ణ ఇంటి సమీపంలోని కొబ్బరితోటలో గడ్డిమేటు వద్ద కుక్క పిల్లను చంపి మింగేందుకు ప్రయత్నిస్తుండగా తల్లి కుక్క అడ్డుకుంది. స్నేక్ క్యాచర్ వర్మకు అందించారు. పాము ఒక కుక్కపిల్లను చంపిదాన్ని మింగేందుకు ప్రయత్నిస్తుండగా వర్మ ఆ తాచుపామును డబ్బాలో బంధించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



పిల్లలతో కుక్క



ఏపీని స్వర్గధామం చేయడమే చంద్రబాబు లక్ష్యం

అమలాపురం టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్‌ను స్వర్గధామంగా చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు సీఎం చంద్రబాబు చేపట్టిన దావోస్ పర్యటన విజయవంతమైందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆనందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో చంద్రబాబు ఎముకలు కొరికే చలిలో సైతం దావోస్‌లో పర్యటించారని గుర్తుచేశారు. ఎందరో పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెడతామని సానుకూలంగా స్పందించారన్నారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్, టాటా చైర్మన్ చంద్రశేఖరన్ వంటి ప్రపంచ దిగ్గజాలు చంద్రబాబు విజన్-2047కు ఎంతగానో ఆకర్షితులై పెట్టుబడులు పెడతామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ నాయకులు పెచ్చెట్టి విజయలక్ష్మి, బొర్రా ఈశ్వరరావు, అధికారి జయవెంకటలక్ష్మి, చింతా శంకరమూర్తి, మల్లుల పోలయ్య పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల స్వీకరణ

ముమ్మిడివరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు నివాస స్థలాలు కేటాయించి సొంత ఇంటి కల సాకారానికి దరఖాస్తులు స్వీకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు డిమాండ్ చేశారు. ముమ్మిడివరం సీపీఐ కార్యాలయంలో శీలం వెంకటేష్ అధ్యక్షతన సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల స్థలాల మంజూరు కోసం దరఖాస్తుల నమోదు కార్యక్రమం ముమ్మిడివరం సమైక్యాంధ్ర ఉద్యమ శిబిరం వద్ద సీపీఐ పార్టీ నిర్వహిస్తుందన్నారు. ఈనెల28న నగర పంచాయతీ పరిధిలోని 20వార్డుల్లో ఆటో ద్వారా ప్రచారం నిర్వహిస్తామని, 29న సమైక్యాంధ్ర ఉద్యమ శిబిరం వద్ద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలకు ఇళ్ల స్థలాల మంజూరు కోసం దరఖాస్తుల నమోదు కార్యక్రమం జరుగుతుందని, ఫిబ్రవరి 9వరకు ఈకార్యక్రమం కొనసాగుతుందన్నారు. నగర పంచాయతీ పరిధిలో ఇళ్లస్థలం లేనివారు, ఇళ్లస్థలం ఉండి ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షల మంజూరు వంటి వాటికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలివెల రాంబాబు, నిమ్మకాయల శ్రీనివాసరావు, భార్గవ్, పలివెల ఆనంద్, కుమార్, శీలం వెంకటేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు కేటాయించాలి

రాజోలు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు చెందిన కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు కేటాయించాలని కల్లుగీత కార్మిక సహకార సంఘ సభ్యులు రాజోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో కానిస్టేబుల్ బి.రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కామన చంద్రరరావు, కడలి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో మండలానికి ఒకటి చొప్పున అయినా షాపులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాటి వీరవెంకటసత్యనారాయణ, కాగితపు వెంకటేశ్వరరావు, చప్పిడి రామదాసు, కడలి సాయిబాబు, గుబ్బల కోటేశ్వరరావు, పెచ్చెట్టి సూర్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణ మూర్తి, గెద్దాడ శ్రీనివాస్, వెలిగట్ల చంద్రుడు, కట్టా సంపదరావు, రాయుడు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రిపబ్లిక్‌డే కప్ పోటీలు

అమలాపురం రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే కప్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కోనసీమ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కోనసీమ, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాజమహేంద్రవరం జట్లు ఈపోటీలో తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోటీల్లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాజమహేంద్రవరం జట్టుతో తలపడ్డ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కోనసీమ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని దక్కించుకుంది. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ బీవీఎస్వీ ప్రసాద్, డాక్టర్ డి.సత్యసునీల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మురమళ్ల వీరేశ్వరస్వామి నిత్య అన్నదాన ట్రస్టుకు సోమవారం అమలాపురానికి చెందిన పరిమి సతీష్‌కుమార్ రూ.10వేలు, హైదరాబాదుకు చెందిన గంటి శ్రీహరిరామకృష్ణ రూ.10వేలు విరాళంగా ఇచ్చారు. ఆలయ అర్చకుడు యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. స్వామి చిత్రపటం, ప్రసాదంతో వారిని సత్కరించారు.

దావోస్ పర్యటన ఏపీ బ్రాండ్ అభివృద్ధికి నాందిపలికింది

పి.గన్నవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటన విజయవంతం కావడంతో ఏపీ బ్రాండ్ అభివృద్ధికి నాంది పలికిందని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు అన్నారు. పి.గన్నవరం టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబునాయుడు, లోకేష్ పాల్గొని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు మాట్లాడుతూ లోకేశ్ యువగళం పాదయాత్ర చేసి రెండేళ్లు పూర్తయిందన్నారు. రాష్ట్రంలో 226 రోజుల్లో 3,132 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన ఘనత లోకేశ్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బొంతు పెదబాబు, దాసరి వీరవెంకటసత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, తోలేటి సత్తిబాబు, గణపతి వీరరాఘవులు, నక్కా సునీల్, చుట్టుగుళ్ల కిషోర్, శేరు శ్రీనుబాబు, యండ్ర శ్రీనివాసరావు, గుత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమాదిగకు అవార్డు పట్ల హర్షం

ఐ.పోలవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మందా కృష్ణమాదిగ చేసిన కృషికి గుర్తింపుగా కేంద్రం ఆయనను పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి హర్షం వ్యక్తం చేసింది. దండోరా నాయకులు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఫిబ్రవరి 7న హైదరాబాదులో జరిగే వేలగొంతులు.. లక్షడప్పులు కార్యక్రమం విజయవంతం కోరుతూ సన్నాహక ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ప్రతి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఉందుర్తి వెంకట్రావు, వీధి చిరంజీవిమాదిగ, వీధి నాగభూషణం, వీధి వెంకటేశ్వరరావు, ఆకుమర్తి మోహన్, సవరపు వెంకట్, ఖండవల్లి ఏలియ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజక చెరువులపై యాజమాన్యపు హక్కు కల్పించాలి

ఐ.పోలవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రజకులకు కేటాయించిన చెరువులపై యాజమాన్యపు హక్కు కల్పించాలని రజక అసోసియేషన్ మండల సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. మురమళ్ల రజక భవనంలో సముదాలపాలెపు పేరయ్య అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. రజకుల చెరువులకు లీజు రద్దు చేసి, యాజమాన్యపు హక్కు కల్పించాలని సమావేశంలో కోరారు. గొల్లపల్లి ధర్మారావుకు రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇవ్వడం పట్ల సమావేశం హర్షం వ్యక్తం చేసింది. సమావేశంలో సామంతకుర్తి సుబ్బారావు, ఆదుర్తి దుర్గారావు, కోటిపల్లి సూర్యనారాయణ, కోటిపల్లి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు సెంటర్‌ను ఏర్పాటుచేసి ఉపాధి కల్పించాలి

మామిడికుదురు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మండలంలో ఒక సర్వీసు సెంటర్‌ను ఏర్పాటుచేసి ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు వృత్తి ఉపాధి కల్పించాలని శ్రీనవదుర్గ ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు కోరారు. సోమవారం ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా మామిడికుదురు, రాజోలు, పి.గన్నవరం మండలాలకు చెందిన యూనిట్ సభ్యులు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా రూ.2లక్షల సబ్సిడీతో పనిముట్లకు రుణ సదుపాయం కల్పించాలని, 75సంవత్సరాల వరకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందే అవకాశం కల్పించాలని కోరారు. సంఘ అధ్యక్షుడు మెడబాలరామారావు, సంఘ కార్యదర్శి బత్తుల జనార్ధనరావు, కోశాధికారి మామిడిశెట్టి సత్యనారాయణ, కమిటీ సభ్యులు కట్టా రాంబాబు, యాండ్ర నారాయణమూర్తి, గంటి రామారావు, చిట్టూరి సురేష్, పితాని శ్రీనివాసరావు, యన్నాబత్తుల బాలచంద్రశేఖర్ పాల్గొన్నారు.


బీసీ ఉద్యోగుల సంఘ సేవలు అభినందనీయం

మామిడికుదురు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ పేర్కొన్నారు. మామిడికుదురు బీసీ సామాజిక భవనంలో సంక్షేమ సంఘ 28వ వార్షికోత్సవం మండలశాఖ అధ్యక్షుడు నయినాల రఘురామయ్య అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో డెల్టా చైర్మన్ పాల్గొని 2023-24లో పది, ఇంటర్ తరగతుల్లో ప్రతిభ కనబరిచిన బీసీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు షీల్డులు అందించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నవారిని అభినందించారు. సంఘ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్, ఏపీఆర్జీసీ శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. సమావేశంలో కోనసీమ జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, బొక్కా వీరవెంకటేశ్వరరావు, జిల్లా ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ముమ్మిడివరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్కిల్ నైపుణ్యాల ద్వారా జీవనోపాధి కల్పించేందుకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. మెప్మా ద్వారా హోం ట్రయాంగిల్‌లో కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్, టీవీ మెకానిక్, వాటర్ ప్యూరిఫైయర్ మెకానిక్, బ్యూటీషన్ ప్రొఫైల్స్ వంటి పనుల్లో ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. దరఖాస్తులను పలువురు సర్వీసు ప్రొవైడర్స్ కోసం నమోదు చేయించుకున్నారు. శిక్షణ పొందిన వారికి ఆయా విభాగాల్లో ఉపాధి కల్పనకు వీలు పడుతుందన్నారు. మెప్మా సీఎంఎం సోమాని భాస్కర్, సీవో రాజేశ్వరి, ఆర్పీలు, మెప్మా విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

పీడీసీఎంఏ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా నాయుడు



అమలాపురం టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం విశ్వవిద్యాల అనుబంధ ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అమలాపురం పట్టణానికి చెందిన విద్యానిధి విద్యా సంస్థల అధినేత ఆకుల బాపన్ననాయుడును అక్కా పీడీసీఎంఏ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రైవేటు అనుబంధ కళాశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నాయుడు తెలిపారు. కార్యక్రమంలో నల్లమిల్లి శేషారెడ్డి, గంధం నారాయణరావు, రాజా, జీవీ రావు, సుధీర్‌బాబు, సీహెచ్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొని నాయుడును అభినందించారు.

కేసీ చంద్రశేఖర్‌కు ఘన నివాళి

యానాం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రీజెన్సీ పరిశ్రమల ఉపాధ్యక్షుడు, విద్యాసంస్థల వైస్ చైర్మన్ దివంగత కేసీ చంద్రశేఖర్ వర్ధంతి సందర్భంగా రీజెన్సీ పాఠశాల ఆవరణలో చంద్రశేఖర్ చిత్రపటానికి విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు, చింతా కొండలరావు, సీహెచ్ వీరభద్రరావు పాల్గొన్నారు. స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు, చిన్నారులకు అన్నాదానం నిర్వహించి పండ్లు, స్వీట్లు పంచారు. ముందుగా వృద్ధాశ్రమం ప్రాంగణంలో ఉన్న చంద్రశేఖర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.రీజెన్సీ కార్మికనేత మచ్చ మురళీమోహన్‌కు కార్మికులు నివాళులర్పించారు. 13వ వర్ధంతిని యూనియన్ కార్యాలయం వద్ద నిర్వహించారు.మురళీమోహన్ చిత్రపటానికి కార్మికులు నివాళులర్పించారు. యూనియన్ ప్రతినిధులు బి.సూర్యభగవాన్, ఏవీవీ సత్యనారాయణ, సాంబశివరావు పాల్గొన్నారు.


ఉత్తమ రైతు అవార్డు గ్రహీతకు నివాళి

మామిడికుదురు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమరైతు అవార్డు గ్రహీత, సీనియర్ టీడీపీ నాయకుడు నయినాల నాగమణిభద్రరావుకు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఘన నివాళులర్పించారు. నాగమణిభద్రరావు ఇటీవల మరణించడంతో ఎంపీ ఆయన చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. భద్రరరావు కుమారుడు సత్యసంజీవ్‌ను పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ మంచి రైతు నాయకుడుని కోల్పోయిందని, ఈసందర్భంగా ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఎంపీతో పాటు మాజీ సర్పంచ్‌లు నయినాల సత్యనారాయణమూర్తి, పోశింశెట్టి విస్సు, నాయకులు వర్ధినేని బాబ్జి, యెరుబండి లక్ష్మయ్య, సాధనాల సుబ్బారావు, నయినాల సూర్య ఉన్నారు. అలాగే వైసీపీ నాయకుడు గొల్లపల్లి సూర్యారావు సోమవారం నాగమణిభద్రరావు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

డిజిటల్ లైబ్రరీకి ఎమ్మెల్యే భూమిపూజ

అయినవిల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాల గ్రంథాలయంలో ఇంటర్నెట్, కంప్యూటర్స్ వంటి అధునాతన సౌకర్యాలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తాయని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పీఎంశ్రీ పథంలో భాగంగా మంజూరైన రూ.23.10లక్షలతో నిర్మించే డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి ఎమ్మెల్యే సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు, సర్పంచ్ కుడుపూడి శాంతావతి, ఎంపీటీసీ యడ్ల కిరణ్‌బాబు, మండల ఉపాధ్యాక్షుడు అడపా నాగభూషణం, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ యడ్ల లక్ష్మీదుర్గ, విద్యా కమిటీ మెంబర్లు, సమగ్రశిక్ష జేఈ వారా నాగేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గాయపడిన కళాశాల కరస్పాండెంట్ మృతి



ఉప్పలగుప్తం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఈనెల18న రోడ్డు ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న గొల్లవిల్లి సీఎస్ఎం, ఎంఎస్ఎస్ కళాశాలల కార్యదర్శి, కరస్పాండెంట్ చిక్కం వీరవెంకటసత్యవరప్రసాదరావు(64) చికిత్స పొందుతూ హైదరాబాదు ఆసుపత్రిలో సోమవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి కళాశాల వద్ద విద్యార్థులు, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు నివాళి అర్పించారు. ఆయన మృతికి ప్రిన్సిపాల్ కంచుమర్తి బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ తోకల దుర్గాఈశ్వరరావు, పాలకవర్గ సభ్యులు విచారం వ్యక్తం చేశారు.

'సామాజిక సేవలో ఓఎన్జీసీ ముందుంటుంది'

మామిడికుదురు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో ఓఎన్జీసీ ముందుంటుందని ఆ సంస్థ చీఫ్ మేనేజర్ సంజయ్‌ఉజ్వల్ పేర్కొన్నారు. సోమవారం నగరం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ జాలెం రమణకుమారి ప్రారంభించారు. 250మందికి పరీక్షలు నిర్వహించి 46మందికి శస్త్రచికిత్సలు త్వరలో నిర్వహిస్తారని తెలిపారు. అనుగ్రహ దృష్టిదాస్ సంస్థ, డివైన్ ఫౌండేషన్, పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య సేవలందించారు. స్థానిక నాయకుడు జాలెం సుబ్బారావు, ముఖ్రం హుస్సేన్, కోళ్ల సురేష్, కార్యదర్శి పీవీఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వెంటూరులో మాస శివరాత్రి పూజలు

రాయవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వెంటూరు పార్వతీసమేత సోమేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. యర్రమాటి రామారావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అర్చకులు, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన, నీరాజన మంత్ర పుష్పాలు, మహా నివేదన జరిపారు.



బీరువాలు బహూకరిస్తున్న కూటమి పార్టీల నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాలకు బీరువాల బహూకరణ

ఆలమూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నాడలో ఆరు అంగన్వాడీ కేంద్రాలకు గొడవర్తి సత్యనారాయణమూర్తి, ఎన్ఆర్ఐ గొడవర్తి వినయ్‌కుమార్ రూ.70 వేలతో సమకూర్చిన ఆరు బీరువాలను నిర్వాహకులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బండారు సంజీవ్, జీఎస్ఎన్ మూర్తి, తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, ఈదల నల్లబాబు, రామానుజుల శేషగిరిరావు, అత్తిలి సత్తిబాబు, సూరిబాబు పాల్గొన్నారు. దాతలను వారు అభినందించారు. జొన్నాడ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్వర్యంలో గొడవర్తి సత్యనారాయణమూర్తి, ఎన్ఆర్ఐ వినయ్‌కుమార్ ఆర్థిక సాయంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కపిలేశ్వరపురం ఎ ల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు 210 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 45 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వంద మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు.



బొటానికల్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న పల్ల సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

బొటానికల్ గార్డెన్ ప్రారంభం

మండపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం బొటానికల్ గార్డెన్‌ను ప్రారంభించారు. కడియానికి చెందిన పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.2 లక్షలు విలువైన మొక్కలను, గార్డెన్ నర్సరీ మెడిసిన్ మొక్కలను అందించారు. ట్రస్టు సభ్యుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గార్డెన్‌కు అవసరమైన మొక్కలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. అనంతరం ఆయన్ను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.గోవిందరాజులు, ట్రస్టుసభ్యులు పల్ల వీర వెంకట సత్యనారాయణ, పాటంశెట్టి శ్రీనివాస చక్రవర్తి, పల్ల వినయ్‌కుమార్, పాటంశెట్టి మైత్రేయ, తాడాల ఆదినారాయణ, అధ్యాపకులు కె.శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, గోపాలకృష్ణ, డాక్టర్ నాయక్, గోపాలకృష్ణ సుందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

కొత్తపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో గతి తప్పిన పాలనను గాడిలో పెట్టి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం వాడపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలోను, పరిపాలనలోను అనుభవం మిండుగా ఉన్న చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు రూ.5లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. 40వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. జక్కంశెట్టి చంటి, కోనాల అంబేడ్కర్, కడియం చిన్న, కొమ్మన రాయుడు, కముజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరు జనార్దనస్వామి ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులు

నవ జనార్దనాలయాల దర్శనం

ఆలమూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నవ జనార్దన క్షేత్రాల దర్శనానికి విజయవాడ నుంచి రెండు బస్సుల్లో 85 మంది భక్తులు తరలివచ్చారు. ఆలమూరు మండలంలోని ఆలమూరు, మడికి, జొన్నాడలతో పాటు ధవళేశ్వరం, కపిలేశ్వరపురం, మాచర, కోరుమిల్లి, కోటిపల్లి, మండపేటల్లోని జనార్దస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఒకేరోజు తొమ్మిది ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకోవాలనే సంకల్పంతో వచ్చినట్టు భక్తులు చెప్పారు.



అంబేడ్కర్, భరతమాత చిత్రపటాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ప్రజాప్రతినిధులు

సంవిధాన్ గౌరవ్ అభియాన్ ర్యాలీ

రాయవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లొల్లలో సోమవారం సంవిధాన్ గౌరవ్ అభియాన్ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. తొలుత భరతమాత, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం విద్యార్థులు, బీజేపీ నాయకులు ఆయా చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు కేవీవీ సాయిరాంప్రసాద్, శాకా దుర్గాశ్రీనివాస్, నరాల రాంబాబు, కోటిపల్లి కృష్ణమాచార్యులు, చిరట్ల సుబ్బారావు, కొత్తపల్లి శ్రీదేవి, ఈరెళ్ల కృష్ణమూర్తి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అంగర జనార్దన్, కరుటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లూరులో లేగ దూడల అందాల ప్రదర్శన పోటీ



లేగ దూడలను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ అనిత, న్యాయనిర్ణేతలు

రాయవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరులో పశుసంవర్ధక శాఖ రాయవరం సహాయ సంచాలకురాలు బి.అనిత ఆధ్వర్యంలో సోమవారం లేగదూడల అందాల ప్రదర్శన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెయ్యి దూడల ఉత్పత్తి పెంచుకోవడం ద్వారా పాడి రైతులు పాల ఉత్పత్తులు పెంపొందించుకుని ఆర్థిక పురోగతి సాధించాలని పిలుపునిచ్చారు. గ్రామానికి చెందిన సుమారు 20 మంది రైతులు తమ దూడలను ప్రదర్శనకు తీసుకువచ్చారు. ముత్యాల రామయ్యచౌదరి గేదె దూడ ప్రథమ బహుమతి, ముత్యాల వీవీ చౌదరి ఆవు దూడ ద్వితీయ బహుమతి, పంపన రాజేశ్వరరావు ఆవు దూడ తృతీయ బహుమతి సాధించాయి. విజేతలుగా నిలిచిన దూడలకు చెందిన రైతులకు బహుమతులు, మందులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా డాక్టర్ అనిత, పి.రామచంద్రరావు, రాజ్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలిక రాఘవ, మాజీ జడ్పీటీసీ నూనె శ్రీదేవి, చుండ్రు వీర్రాజు, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, వైద్యులు పి.విజయ్, ఎ.నాగశ్రావణి, ఎ.భావన తదితరులు పాల్గొన్నారు.





రాయవరం, ద్రాక్షారామల్లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్లు

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

రాయవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎలక్ట్రీషియన్లు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ఆల్వా ఎడిసన్ చిత్రపటాలతో రాయవరం, వి.సావరం, వెదురుపాక, పసలపూడి, చెల్లూరు, మాచవరం, సోమేశ్వరం, లొల్ల గ్రామాల్లో ప్రదర్శన జరిపారు. ది ఎలక్ట్రీషియన్స్ ప్లంబర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు నేకూరి నాని బాబు, ఉపాధ్యక్షుడు గండి శేఖర్, కార్యదర్శి పొట్నూరి రాంబాబు, సభ్యులు నేకూరి నాని బాబు, చంద్రమళ్ల సంజయ్‌రాజు, లంక వెంకట రాజు, కురుపూడి నాగరాజు, గుబ్బల శ్రీనివాస్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రీషియన్స్ డేను పురస్కరించుకుని ద్రాక్షారామలో ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్లు 130 మంది గీతా మందిరం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘవి ఎలక్ట్రికల్స్ యాజమాన్యం ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.



రామచంద్రపురంలో యువగళం కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

'లోకేశ్ పాదయాత్ర స్ఫూర్తిదాయకం'

రాయవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ అరాచక పాలన నుంచి విముక్తి కల్పించేలా ప్రజల మద్దతు కూడగట్టేందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్ర స్ఫూర్తిదాయకంగా నిలిచిందని మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి (కూర్మాపురం అబ్బు) అన్నారు. సోమవారం ఆయన కూర్మాపురంలో విలేకరులతో మాట్లాడుతూ లోకేశ్ యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికిందన్నారు.

ద్రాక్షారామ (రామచంద్రపురం) (ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్ర చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రామచంద్రపురంలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కూటమి నాయకులు గరిగపాటి సూర్యనారాయణ, కొమరిన వీర్రాజు, జాస్తి విజయలక్ష్మి, కడియాల రాఘవన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

'రహదారి భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలి'

రావులపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదరహిత సమాజ నిర్మాణానికి వాహనచోదకులు రహదారి భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఓలేటి శ్రీనివాస్ కోరారు. గోపాలపురం జాతీయ రహదారి చెంతన ఉన్న అవంతి సీఫుడ్స్‌లో అవంతి, నెక్కంటి సంస్థల్లో పనిచేస్తున్న వాహనాల డ్రైవర్లకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ కుటుంబాన్ని, వాహనాల్లో ఉన్న ప్రయాణికుల్ని దృష్టిలో పెట్టుకుని డ్రైవర్లు వేగ నియంత్రణతో వాహనాలు నడపాలన్నారు. రాత్రి వేళలోను, తెల్లవారుజామున పొగమంచు కురుస్తున్న కారణంగా అందుకు అనుగుణంగా వాహనాలు నడపాలన్నారు. అసిస్టెంట్ ఎంవీఐ షణ్ముఖ శ్రీనివాస్, అవంతి, నెక్కంటి సంస్థల హెచ్‌ఆర్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



బీసీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దారు, ఉద్యోగ సంఘాల నాయకులు

బీసీ ఉద్యోగుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

కపిలేశ్వరపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వర్కింగ్ కమిటీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం ఆధ్వర్యంలో సోమవారం బీసీ ఉద్యోగుల సంఘం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కపిలేశ్వరపురం తహసీల్దారు పి.చిన్నారావు, జిల్లా బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కపిలేశ్వరపురం మండల శాఖ గౌరవాధ్యక్షుడు కె.శివచక్రవర్తి, వర్కింగ్ కమిటీ చైర్మన్ కె.జానకిరామయ్య, అధ్యక్షుడు జి.ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి.సురేష్ అధిక సంఖ్యలో బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఏపీ ఎన్జీవో మండపేట యూనిట్ అధ్యక్షుడు జె.మల్లికార్జునుడు, పంచాయతీ కార్యదర్శి కె.శివచక్రవర్తి, ఉపాధ్యాయులు ఎం.అనంత సత్యనారాయణమూర్తి, టి.గనిరాజు, సురేష్, సత్యనారాయణ, కడలి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ స్పీకింగ్ బుక్స్ పంపిణీ



ఆలమూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): చింతలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రీరామ రేపిడెక్స్ ఇంగ్లిష్ స్పీకింగ్ బుక్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు ఉడతా వెంకటేశ్వరరావు, వాసా దుర్గాప్రసాద్, మాజీ జడ్పీటీసీ దండంగి మమత, మాజీ ఎంపీపీ దండంగి రామారావు, ఆలమూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు వైట్ల గంగరాజు, దేవస్థానం మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబు, దేవాబత్తుల సత్యనారాయణ, మార్గాని ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో వెంకటరామన్‌కు సత్కారం

ఆత్రేయపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం ఎంపీడీవో వీకేఎస్ఎస్వీ రామన్ జిల్లా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. సోమవారం ఆయన్ను మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

మెర్లపాలెంలో ఎమ్మార్పీఎస్ సంబరాలు

ఆత్రేయపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' అవార్డు ప్రకటించడంపై ఎమ్మార్పీఎస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం యాకోబు ఆధ్వర్యంలో మెర్లపాలెంలో బాబూజగజ్జీవన్ రామ్ విగ్రహం వద్ద కృష్ణ మాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మురళీకృష్ణ

ద్వారపూడిలో సమస్యలపై
కలెక్టర్‌కు ఫిర్యాదు

మండపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో నెలకొన్న సమస్యలపై గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కె.మురళీకృష్ణ సోమవారం అమలాపురంలో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. చెరువు రెండు ఎకరాల మేర ఆక్రమణకు గురికావడంపై విచారణ చేయాలని కోరారు. పంచాయతీ స్థలాల ఆక్రమణపై కూడా ఫిర్యాదు చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారని మురళీకృష్ణ చెప్పారు.

తాజుద్దీన్ బాబా గంధోత్సవం

రాయవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడిలో నాగూర్ బాబా దర్గా వద్ద హజరత్ తాజుద్దీన్ బాబా 16వ గంధోత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఖాదర్ వలీ బాబా అధ్యక్షతన గంధపు బిందెతో గ్రామోత్సవం జరిపి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పసలపూడి, పరిసర ప్రాంతాల భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.





దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.20 లక్షలు

ఆత్రేయపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,20,150 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అన్నదాన భవన నిర్మాణానికి గణపవరం మండలం అర్ధవరానికి చెందిన అడ్డాడ వెంకటనాగరాజు-సురేఖ దంపతులు రూ.1,11,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహినీకేశవస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన దండాల రమేష్-రాధారాణి దంపతులు సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. వారికి ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పుట్టాలమ్మవారి జాతర

కె.గంగవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పామర్రు గ్రామ దేవత పుట్టాలమ్మవారి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న శ్రీనివాస్

ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు

ఆలమూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పంట కాల్వలు ఆక్రమణలకు గురికావడంతో సాగునీరు సక్రమంగా పారక రైతులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారని ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్‌కు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. సోమవారం అమలాపురంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఆయన ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆక్రమణల కారణంగా పంట కాల్వల తవ్వకాలకు ఇబ్బందిగా మారిందని, దిగువ ప్రాంతాల్లో చివరి భూములకు సాగునీరు చేరక రైతులు వరి సాగుకు పాట్లు పడుతున్నారని వివరించారు. తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలని శ్రీనివాస్ కోరారు.

శివలలో ఉచిత పశు వైద్య శిబిరం

కె.గంగవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివల గ్రామంలో సోమవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. దీనిని యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు (సుబ్బు), ఎంపీటీసీ వాసంశెట్టి నాగమణి శ్రీనివాసు, సర్పంచ్ అనసూరి సాయిబాబు ప్రారంభించారు. పశువులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పశువైద్యులు జి.సురేష్‌బాబు, ఎం.కాశీ విశ్వేశ్వరరావు, సిబ్బంది సేవలు అందించారు. కూటమి నాయకులు బలుసు శివప్రసాద్, దువ్వూరి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.